www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

బుధవారం 14 జూన్ 2023

1

నిద్రిస్తున్న వ్యక్తిపై యాసిడ్ దాడి

నవతెలంగాణ-ముధోల్

మండలంలోని తరోడ గ్రామానికి చెందిన గడపలే మోహన్‌పై మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి యాసిడ్ దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం... మోహన్ సోమవారం రాత్రి తన సమీప బంధువు స్లాబ్‌పై నిద్రించాడు. మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి యాసిడ్‌తో దాడి చేసి పరుగులు పెట్టాడు. దీంతో మంటలు భరించలేక బాధితుడు అరుపులు మొదలుపెట్టడంతో స్థానికులు కుటుంబీకులు మేల్కొని హుటాహుటిన చికిత్స నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. శరీరంతో పాటు కొంత ముఖ భాగం కాలింది. గుర్తు తెలియని వ్యక్తి దుప్పటి కప్పుకొని వచ్చి యాసిడ్‌తో దాడి చేశారని బాధితుడు తెలిపినట్లు స్థానికులు పేర్కొన్నారు. సంఘటన స్థలాన్ని ఎస్సై సాయికిరణ్ చేరుకొని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

అనుమతుల్లేని కళాశాలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ



ఆదిలాబాద్‌టౌన్ : జిల్లా కేంద్ర సమీపంలోని మావలలో ఉన్న డా.పవర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పారా మెడికల్ సైన్సెస్ కళాశాలలో అనుమతులు లేకుండా అడ్మిషన్స్ తీసుకుంటున్నారని, ఆ విద్యాసంస్థపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్రం నగేష్ అన్నారు. ఈ విషయమై మంగళవారం కలెక్టరేట్‌లో ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఆ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. అడ్మిషన్ల పేరుతో విద్యార్థుల నుండి వసూలు చేసిన డబ్బులను తిరిగి విద్యార్థులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, వరుణ్ ఉన్నారు.

విత్తన కొరత..అన్నదాత వెత..!

- దుకాణాల ఎదుట బారులు తీరుతున్న కర్షకులు
- రాశి-659, కబడ్డీ రకాల కోసం వెతుకులాట
- ఇదే అదనుగా కృత్రిమ కొరత సృష్టిస్తున్న డీలర్లు
- అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న వైనం
- మామూలుగా తీసుకుంటున్న వ్యవసాయ అధికారులు

జిల్లాలో విత్తనాల కొరత అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. మునుపటి పరిస్థితులను తలపించేలా దుకాణాల ఎదుట వరుస కట్టేలా చేస్తోంది. నేలలకు అనుకూలమైన విత్తనాల కోసం అన్నదాతలు ఆపసోపాలు పడాల్సి వస్తోంది. మృగశిర కార్తె ముగియడం.. ఒకటి, రెండు రోజుల్లో వర్షాలు వచ్చే అవకాశం ఉండటం.. అవసరమైన విత్తనాలు లభించక ఆందోళన చెందుతున్నారు. తెల్లవారుజామునే పల్లెల నుంచి బయలుదేరి విత్తన దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. ముఖ్యంగా రాసి-659 రకం, కబడ్డీ రకం విత్తనాల కోసం దుకాణాల్లో వెతుకుతున్నారు. ఎక్కడ ఉన్నాయనే తెలిస్తే అక్కడ గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న కొందరు డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మరోపక్క కొన్ని మండలాల్లో విత్తన ప్యాకెట్ ఎమ్మార్పీ ధర రూ.853 ఉండగా.. సరిపడినంత లేదనే సాకుతో ఒక్కో ప్యాకెట్‌కు రూ.1350 వరకు తీసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా విత్తనాల కొరతతో అన్నదాతలు అల్లాడిపోతుంటే వ్యవసాయశాఖ అధికారులు మామూలుగా తీసుకుంటున్నారనే విమర్శలున్నాయి.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్ అర్బన్, సిరికొండ

జిల్లా రైతులు విత్తనాల కొరతను ఎదుర్కొంటున్నారు. ఒకటి, రెండు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అన్నదాతలు విత్తనాల కోసం వెతకాల్సిన పరిస్థితి ఉంది. ఇక్కడి నేలలకు అనుకూలంగా ఉంటుందనే కారణంగా అనేక మంది రైతులు రాసి-659, కబడ్డీ రకాలపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఏపుగా పెరగడం..కాయ పెద్దగా ఉంటుందనే కారణంగా వీటిని వేసేందుకు ఎక్కువ మంది రైతులు మొగ్గుచూపుతున్నారు. జిల్లా వ్యవసాయశాఖ ఈ ఏడాది ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా జిల్లాలో రూ.5.66లక్షల ఎకరాల్లో సాగు చేయనుండగా.. ఇందులో పత్తి 3.58లక్షల ఎకరాల్లో సాగు చేయనున్నట్లు ప్రణాళిక రూపొందించారు. ఇందుకు జిల్లాకు 8.50లక్షల విత్తన ప్యాకెట్లు అవసరమని ప్రతిపాదించారు. కానీ ఇప్పటికే 8లక్షల వరకు జిల్లాకు చేరాయని అధికారులు చెబుతున్నారు. దాదాపు సరిపడినంత విత్తనాలు జిల్లాకు వచ్చినా కొరత ఉందని చెబుతుండటం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా అనేక మంది రైతులు విత్తనాల కోసం జిల్లా, మండల, పట్టణ కేంద్రాలకు వచ్చి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆయా దుకాణదారులు ఒక్కో పాస్‌బుక్‌కు కేవలం రెండు ప్యాకెట్లు మాత్రమే ఇస్తామని చెప్పడం.. సాగు చేయాల్సిన భూమి అధికంగా ఉండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గంటల తరబడి ఆయా దుకాణాల ఎదుట నిరీక్షిస్తూ విత్తనాల కోసం అవస్థలు పడుతున్నారు.

విత్తనాల కోసం కుస్తీ పట్టే పరిస్థితి : బెల్లపు దేవన్న, రైతు, కుచులాపూర్



ఊరి నుంచి విత్తనాల కోసం ఉదయాన్నే జిల్లా కేంద్రానికి వచ్చాను. 8గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిరీక్షించాను. విత్తనాలు అందుబాటులో ఉన్నా కేవలం మూడు గంటలు మాత్రమే పంపిణీ చేశారు. సమయం ముగిసింది ఇక్కడి నుంచి వెళ్లిపోండని చెప్పారు. ఇతర చోటకు వెళ్లి కొనుగోలు చేయాలని చెబుతున్నారు. కానీ అన్ని దుకాణాలు తిరుగుతున్నా ఎక్కడా లభించడంలేదు. తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం.

గంటల తరబడి నిరీక్షించినా లాభం లేదు : పెండెపు శ్రీనివాస్, రైతు, అందర్‌బంద్




మాకు అవసరమైన విత్తనాల కోసం మా ఊరు 30కిలోమీటర్ల దూరం నుంచి జిల్లా కేంద్రానికి వచ్చాను. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం వరకు దుకాణం ముందు వరుసలో నిల్చున్నాను. కానీ నా వరకు వచ్చే సరికి స్టాకు అయిపోయిందని చెప్పారు. కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే అనుమానం ఉంది. మండుటెండలో కొన్ని గంటల పాటు నిరీక్షించినా లాభం లేకుండా పోయింది.

అధిక ధరలకు విక్రయిస్తూ..!

జిల్లాలో విత్తనాల కోసం మన ప్రాంత రైతులే కాకుండా సమీప మహారాష్ట్ర నుంచి రైతులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా సరిహద్దు గ్రామాల నుంచి ఇక్కడకు పెద్ద ఎత్తున వచ్చి కొనుగోలు చేయడం మూలంగా జిల్లాలో అవసరం మేర ఉండాల్సిన విత్తనాలు కొరత ఏర్పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోపక్క జిల్లాలోని సిరికొండ, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, గడిహత్నూర్ తదితర మండలాల్లో విత్తన ప్యాకెట్లను ఎమ్మార్పీ ధర కంటే అధికంగా విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కబడ్డీ రకం విత్తనాలు సరిపడా లేవనే కారణంగా వీటిని కావాలంటే అధిక ధర చెల్లించాల్సిందేననే కొందరు డీలర్లు హుకుం జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో గత్యంతరం లేక రైతులు ఒక్కో ప్యాకెట్‌కు రూ.1300 నుంచి రూ.1400వరకు చెల్లిస్తూ కొనుగోలు చేస్తున్నారు. సదరు దుకాణ యజమానులు బిల్లుపై మాత్రం ఎమ్మార్పీ ధరనే నమోదు చేస్తున్నారు. కానీ అనధికారికంగా బిల్లు వెనుక భాగంలో వారు తీసుకొనే అధిక ధరను రాసి రైతులకు అందజేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నించిన రైతులకు విత్తనాలు లభించే పరిస్థితి లేకపోవడంతో చేసేదేమీ లేక మిన్నకుండిపోతున్నట్లు పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దృష్టిసారించని అధికారులు..!

జిల్లాలో విత్తన కొరతతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నా అధికార యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి. రైతులు ఉదయం పూటనే ఆయా దుకాణాల వద్దకు వచ్చి విత్తనాల కోసం గంటల తరబడి నిరీక్షించి ఆపసోపాలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లదేనే విమర్శలున్నాయి. జిల్లా కేంద్రంలోని ఒకటి, రెండు దుకాణాల ఎదుట రైతులు విత్తనాల కోసం బారులు తీరుతున్నారు. అయినప్పటికీ సరిపడా ప్యాకెట్లు లభించడం లేదు. అధికారులు ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జిల్లాకు సరిపడా విత్తనాలు తెప్పించాల్సి ఉండగా.. ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. ముఖ్యంగా కొన్ని మండలాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నా వ్యవసాయశాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు మామూలుగా తీసుకుంటున్నారనే విమర్శలున్నాయి.



మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- ఘనంగా మహిళా సంక్షేమ దినోత్సవం
- భారీగా తరలివచ్చిన మహిళలు



నవతెలంగాణ-ఖానాపూర్

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఏఎంకె ఫంక్షన్ హాల్లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళ సంక్షేమ దినోత్సవం జరిపారు. దీనికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి దేశంలో మరే ఇతర రాష్ట్రం ప్రవేశపెట్టని విప్లవాత్మక పథకాలను, కార్యక్రమాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు, భద్రతకు, వారు అన్ని రంగాలలో రాణించేందుకు ప్రత్యేక ప్రోత్సాహాన్ని ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళలు, మహిళ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రవాణశాఖ అధికారుల తనిఖీలు

- ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఐదు బస్సులు సీజ్



నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్నతాధికారుల ఆదేశంతో జిల్లా రవాణశాఖ అధికారులు మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ఉత్తర్‌ప్రదేశ్‌కు కార్మికులను తీసుకొని ఓవర్ లోడ్‌తో వెళ్తున్న అయిదు బస్సులను సీజ్ చేసి డిపోకు తరలించారు. మరోపక్క పలు స్కూల్ బస్సులను కూడా తనిఖీలు చేశారు. వాహనపత్రాలు, బస్సు సామర్థ్యం తదితర వాటిని పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఏఎంవీఐలు సంతోష్, రామారావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రతిరోజు క్రీడలు ఆడడం వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని జన శిక్షణ సంస్థ డైరెక్టర్ ఎం.శ్యామల తెలిపారు. టి20 కార్యక్రమంలో భాగంగా మహాలక్ష్మివాడ మహిళలతో మంగళవారం ఇండోర్ గేమ్స్ క్రీడలను ప్రోగ్రాం ఆఫీసర్ రాజన్నతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెస్, క్యారం బోర్డు వంటి క్రీడల వల్ల జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని తెలిపారు. క్రీడలతోపాటు వ్యాయామం, యోగా ప్రతిరోజు చేస్తే ఆరోగ్యకరంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది సంతోష్, రాజు, టీచర్లు పాల్గొన్నారు.

డిపో ఎదుట ఆర్టీసీ కార్మికుల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఆదిలాబాద్ డిపోలో కార్మికులు డిమాండ్స్ డే ను నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో ఎదుట డిమాండ్స్ బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, ఆర్టీసీ కార్మికులపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. పేస్కేల్ వర్తింపజేయాలని, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వివిధ డిమాండ్‌లపై డిమాండ్స్ డే ను నిర్వహించారు. ఇందులో యూనియని నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆవులు తరలిస్తున్న వ్యక్తులపై కేసు

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

సామర్థ్యానికి మించి ఎలాంటి సరైన ధ్రువపత్రాలు లేకుండా ఆవులను అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. మంగళవారం ఉదయం పోలీసులు కడెం వైపు నుండి నిర్మల్ వెళుతున్న టాటా ఏస్ గూడ్స్ వాహనం టిఎస్19టిఏ - 4221 వస్తుండగా అనుమానం వచ్చి పరిశీలించారు. అందులో సామర్థ్యానికి మించి ఐదు ఆవులు, దూడ తీసుకెళ్తున్నారు. ఆరు ఆవులకు సంబంధించి కొనుగోలుకు సరైన రశీదు, అనుమతి పత్రాలు లేని కారణంగా ఆవులను గోశాలకు తరలించి, వాహన చోదకుడితో పాటు మరో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఇటుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీబోల్తా

నవతెలంగాణ-కడెం

ఇటుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీబోల్తా పడి ముగ్గురికి గాయాలైన ఘటన మంగళవారం మండలంలో జరిగింది. ఏఎస్ఐ భీంరావు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రం నుండి అంబారిపేట్ వైపు ఇటుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ కన్నాపూర్ సమీపంలో ట్రాలీ బోల్తా పడింది. ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న ఒకరికి తీవ్ర గాయాలు కాగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. విచారణ చేపడుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రక్తదానం...మహాదానం

- నేడు ప్రపంచ రక్తదాన దినోత్సవం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

అన్ని దానాల్లోకెల్లా గొప్ప దానం రక్తదానం. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులు, గర్భిణులు, గర్భకోశ వ్యాధిగ్రస్తులు, రక్తహీనత గలవారు, శస్త్ర చికిత్స అవసరమైన వారు ఇలా చాలామంది సకాలంలో అవసరమైన రక్తం అందక మృతి చెందుతున్నారు. కుల, మత, భాష, వర్గ, వర్ణ బేధాలు లేకుండా ప్రాణాలను నిలబెట్టే రక్తం ప్రాధాన్యత అనిర్వచనీయమైంది. తల్లి జన్మనిస్తే రక్తం పునర్జన్మనిస్తుంది. రక్తదానం చేసే వారి ఆరోగ్యం మునుపటి కంటే ఆరోగ్యంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. రక్తదానం 18 సంవత్సరాల నుండి 56 సంవత్సరాలు లోపు గల ఆరోగ్య వంతులు ఎవరైనా రక్తదానం చేయవచ్చు. పుట్టినరోజు మొదలుకొని వివిధ సందర్భాలలో యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో గతంలో చిరంజీవి అభిమాన సంఘానికి చెందిన బాల శంకర్ కృష్ణ , పట్టణ యువజన సంఘాల సమితికి చెందిన ఊరే గణేష్, బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్‌కు చెందిన అజీజ్, అమన్ ఫౌండేషన్‌కు చెందిన అర్పత్‌ఖాన్ స్వచ్ఛందంగా రక్తదానం చేస్తూ తమ సంఘాల ద్వారా విస్తృతంగా రక్తదానాలు చేయిస్తున్నారు. అనేక మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వివిధ కారణాలతో వైద్యం కోసం రిమ్స్‌కు వచ్చే రోగులకు అవసరమైన రక్తాన్ని సమకూరుస్తూ భేష్ అనిపించుకుంటున్నారు. స్వయంగా పదుల సంఖ్యలో రక్తదానాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. రక్తదాన ఆవశ్యకతను వివరిస్తూ యువకులకు అవగాహన కల్పిస్తున్నారు. రిమ్స్‌లో తమ ఫోన్ నెంబర్లను అందుబాటులో ఉంచుతూ నిత్యం అవసరమైన వారికి స్వచ్ఛందంగా సంఘాలకతీతంగా రక్తాన్ని అందజేస్తున్నారు. జిల్లా స్థాయి నుంచి ఉత్తమ రక్తదాతలుగా రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. కుల, మతాలకు అతీతంగా యువకులు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరుతున్నారు. రక్తం ఏ పరిశ్రమలో తయారు కాదని, మనిషి శరీరంలో మాత్రమే అది తయారవుతుందని అటువంటి రక్తాన్ని ఇతరులకు దానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని వివిధ సంఘాల ప్రతినిధులు పిలుపునిస్తున్నారు.



ఎట్టకేలకు ప్రారంభమైన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

- ఒక్కరోజే 63 మంది డిబార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని రెగ్యులర్/బ్యాక్‌లాగ్ డిగ్రీ పరీక్షలు ఎట్టకేలకు మంగళవారం నుండి ప్రారంభమయ్యాయి. 2వ, 6వ సెమిస్టర్ విద్యార్థులకు మంగళవారం నుంచి 4వ సెమిస్టర్ విద్యార్థులకు బుధవారం నుంచి పరీక్షలు జరగనున్నాయి. గత నెలలో పరీక్షల తేదీల షెడ్యూల్‌ను విడుదల చేయగా కొన్ని సార్లు మార్పులు చేర్పులు చేశారు. ఎన్నో వాయిదాల అనంతరం చివరికి ఈ నెల 13 నుంచి జరుగుతాయని ప్రకటించారు. దీంతో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఇందుకు జిల్లాలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఆయా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి అనుమతించారు. మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

కాపీ కొడుతూ 63 మంది డిబార్

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం జరిగిన పరీక్షలో రాష్ట్రంలో 66 మందికి డిబార్ అయినట్లు కేయు పరీక్షల విభాగం అధికారులు మల్లారెడ్డి, నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి 63 మంది ఉన్నట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పలు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. మధ్యాహ్నం 2వ సెమిస్టర్ విద్యార్థులకు 2గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష జరిగింది. ఇందులో వివేకానంద డిగ్రీ కళాశాల ఇచ్చోడలో 57 మంది, ఛత్రపతి డిగ్రీ కళాశాల ఇచ్చోడలో 6 గురు చొప్పున డిబార్ అయినట్లు పేర్కొన్నారు. మొదటి రోజే 63 మంది అది కూడా ఒక్క మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రాల్లోని డిబార్ అవ్వడం గమనార్హం. కాపీయింగ్ ఎవరైన పాల్పడితే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

గౌడ కులస్తులకూ రూ.లక్ష ఆర్థిక సాయం పథకాన్ని అమలు చేయాలి



నవతెలంగాణ-కడెం

బీసీ కుల వృత్తిదారులకు అందించే లక్ష రూపాయల ఆర్థిక సహాయ పథకాన్ని ప్రభుత్వం బీసీ గౌడ కులస్తులకు సైతం అందించాలని మండల గౌడ కులస్తులు కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ చిన్నయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన గౌడ కులస్తులు కులవృత్తి మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తు కుటుంబాలను పోషిస్తున్నారన్నారు. గీత కార్మికుడు చెట్టు మీద నుండి పడి చనిపోతే ఇచ్చే ఎక్స్‌గ్రేషియా తప్ప బతికున్న గీత కార్మికులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి పథకాలు అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా బీసీ గౌడ కులస్తుల ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం సహకరించి లక్ష రూపాయల ఆర్థిక సహాయ పథకాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నిరసన కార్యక్రమానికి సిపిఐ-ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు సునారికారి రాజేష్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు కులస్తులు శేఖర్‌గౌడ్, సాయిగౌడ్, రాజగౌడ్, వెంకటేష్‌గౌడ్, శ్రీపతిగౌడ్, రాజేశ్వర్‌గౌడ్, కమలాకర్‌గౌడ్, తిరుపతిగౌడ్, సతీష్‌గౌడ్ పాల్గొన్నారు.

శ్రీహరిరావు రాజీనామాతో ఎవరెటు..?

నవతెలంగాణ-లక్ష్మణచాంద

కొంత కాలంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తీరుతో అసంతృప్తిగా ఉన్న తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకులు కుచాడి శ్రీహరిరావు సోమవారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. దీంతో మండల బీఆర్ఎస్ నాయకులు ఎవరెటు అనే ప్రశ్న తలేత్తుతోంది. కొంతమంది అసంతృప్త నాయకులు శ్రీహరిరావుతో కలిసి వెళ్తారనే ప్రచారం జరుగుతోంది. మండల కేంద్రానికి చెందిన మాజీ యూత్ అధ్యక్షులు, కొంతమంది సీనియర్ నాయకులు, మరికొంత మంది కీలక నాయకులు, కొందరు మాజీ సర్పంచులు శ్రీహరిరావు వెంట నడవడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఉద్యమ కాలం నుండి జెండా మోసిన తమకు తీవ్ర అన్యాయం జరిగిందని లోలోపల బాధ పడిన నాయకుల దారి ఎటువైపు పడనుందో త్వరలో తెలియనుంది. ఏదేమైనా ఈ పరిణామం అధికార బీఆర్ఎస్‌తో పాటు ఇతర పార్టీలపై ప్రభావం చూపనుందని పలువురు పేర్కొంటున్నారు. ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరిన తరువాత మండలంలో కాంగ్రెస్ కనుమరుగయ్యే పరిస్థితి నెలకొన్న తరుణంలో రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఉద్యమ పార్టీని వీడి స్వరాష్ట్రం ఇచ్చి హామీ నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీలోకి శ్రీహరిరావు చేరుతారనే చర్చ జోరుగా సాగుతోంది. ఆయన కాంగ్రెస్‌లో చేరిన అనంతరం జిల్లా స్థాయిలో ప్రాధాన్యత ఉన్న కీలక పదవీ ఇవ్వనున్నట్లు సమాచారం. ఇదే దిశగా శ్రీహరిరావు సంకేతాలు ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీలో చేరిక లాంఛనమే అనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఆఫర్ సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని సాయిఆర్తి ఇంటర్ ప్రైజెస్ ఐషర్ ట్రాక్టర్స్ వారు కల్పిస్తున్న మాన్ సూన్ డబుల్ ధమాకా కాంబో ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రొప్రైటర్ దీపక్ సింగ్ శెఖావత్ తెలిపారు. ఐషర్ 333 ట్రాక్టర్ ధర రూ.6,75,000 ఉండగా ఆఫర్ ధర రూ.5,55,333కు లభిస్తుందని, ఐషర్ 380 ట్రాక్టర్ రూ.7,05,000 ఉండగా ఆఫర్ ధర రూ.5,85,380కి లభిస్తుందని, ఐషర్ 551 ట్రాక్టర్ రూ.10,70,000 ఉండగా ఆఫర్ ధర రూ.9,99,551కి లభిస్తుందని తెలిపారు. ఈ ట్రాక్టర్‌పై బుల్లెట్ బండి బహుమతిగా లభిస్తుందన్నారు. అదేవిధంగా ఐషర్ ప్రైమ -557 ట్రాక్టర్ కొనుగోలుపై హీరో హోండా స్ప్లెండర్ బైక్ ఉచితంగా పొందొచ్చని తెలిపారు. ఐషర్ ప్రైమ-551 ట్రాక్టర్ కొనుగోలుపై హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్ బైక్ ఉచితంగా పొందొచ్చన్నారు. ఐషర్ ప్రైమ- 480 ట్రాక్టర్ కొనుగోలుపై హీరో క్సమ్ బైక్ ఉచితంగా పొందవచ్చని, ఈ అవకాశాన్ని వినియోగించుకునే వారు 8883513111, 9493593294 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

విత్తనాలు ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్య

నవతెలంగాణ-నేరడిగొండ



మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను మండల వ్యవసాయ అధికారి భాస్కర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు ఎక్కువ ధరలకు విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దుకాణాల్లో విత్తనాల ధరలు, స్టాక్ లభ్యతా తదితర వివరాలు తెలిపే బోర్డు పెట్టాలన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి రైతులకు పలు సూచనలు చేశారు. ఎంఆర్పి ధర కన్నా ఎక్కువ ధరకు అమ్మినట్లయితే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. విత్తనాలు కొనేటప్పుడు తప్పకుండా రశీదు తీసుకోవాలన్నారు.

బస్ పాసుల కొరకు దరఖాస్తులు ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



విద్యా సంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు ఆర్టీసీ బస్ పాసుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన సూచించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆర్టీసీ డిపో కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. 12 సంవత్సరాల లోపు బాలురలకు, 18 సంవత్సరాల లోపు పదవ తరగతి వరకు బాలికలకు ఉచిత బస్సు పాసులు అందజేయడం జరుగుతుందన్నారు. రుసుము రూ.50 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం బస్టాండ్‌లోని బస్ కౌంటర్లను సంప్రదించాలని సూచించారు.

ఉత్తమ గ్రామపంచాయతీగా దేవాపూర్



నవతెలంగాణ-తలమడుగు

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని దేవాపురం గ్రామపంచాయతీ ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైంది. మంగళవారం బోథ్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవం సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న అర్చనను ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, ట్రైనీ కలెక్టర్ వికాస్ మహతో శాలువాతో సన్మానించారు. ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎన్నికైనందుకు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు అబ్దుల్లా, ఆర్డీఓ, ఐసిడిఎస్ సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతాదారులు పాలసీ చేసుకోవాలి



నవతెలంగాణ-తాంసి

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకుల్లో ఖాతా కలిగి ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరూ పాలసీ చేసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బ్యాంక్ ఆవరణలో గ్రామ ప్రజలకు బ్యాంక్ లావాదేవీలు, పాలసీ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతా కలిగి ఉన్న ప్రతి ఒక్కరు ఏడాదికి రూ.20 లేదా రూ.400 పాలసీ తప్పకుండా చేసుకోవాలన్నారు. ప్రమాదం జరిగినా, సాధారణ మరణం సంభవించినా పాలసీ వర్తించే స్కీములున్నాయన్నారు. సందేహాలుంటే బ్యాంక్ మేనేజర్‌ను లేదా సిబ్బందితో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాటిపల్లి రాజు, గ్రామ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, బ్యాంక్ మేనేజర్ సాయిరాం, బ్యాక్ సిబ్బంది సునీల్, గ్రామస్తులు సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్నకు చిత్రపటాలకు పాలాభిషేకం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మావల మండలం బట్టిసావర్గాం గ్రామ పంచాయతీలో మంగళవారం వికలాంగులు, మల్టీపర్పస్ వర్కర్లు కలిసి సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్న చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. వికలాంగులకు అదనంగా పింఛన్ పెంచడంతో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఏవన్, రాగం గోవర్ధన్, కొరటి ప్రభాకర్, రాములు, ప్రభాకర్‌రెడ్డి, మల్టీ పర్పస్ వర్కర్స్ గంగన్న, ఊశన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో యువకుల చేరిక



నవతెలంగాణ-తాంసి

టిపిసిసి కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నెల అశోక్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని గిరిగాం గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన 30 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి డాక్టర్ వన్నెల అశోక్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా యువకులను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్ను పటేల్, గంగారాం, కిరణ్‌రెడ్డి, రాజబలి, శంకర్, దేవిదాస్, హన్మండ్లు, గజానంద్, కిష్టన్న పాల్గొన్నారు.

నేడు మండలానికి ఎమ్మెల్యే రాక

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్ర సమీపంలోని కస్తూర్బా పాఠశాల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ రానున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోర్బండ్ బాలాజీ, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పార్టీ కార్యకర్తలంతా రావాలని కోరారు.

మృతి చెందిన ఆవుకు నష్టపరిహారం అందజేయాలి

నవతెలంగాణ-నిర్మల్

విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సోన్ మండలం సిద్దులకుంట గ్రామానికి చెందిన కొండూరు మైపాల్‌కు చెందిన ఆవుకు నష్టపరిహారం అందజేయాలని గ్రామ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో ట్రాన్స్‌ఫార్లకు ఉన్న కంచెలు శిథిలావస్థకు చేరాయని, కొత్త కంచెలు ఏర్పాటు చేయాలని చాలా సార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో మూగజీవాలు విద్యుద్ఘాతానికి గురవుతున్నాయని తెలిపారు.

ఘనంగా మహిళా సంక్షేమ దినోత్సవం

● మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారు : జడ్పీ చైర్మెన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తున్నదని జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని స్థానిక జనార్ధన్‌రెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన మహిళా సంక్షేమ దినోత్సవ వేడుకలలో కలెక్టర్ రాహుల్ రాజ్ పి.ఎస్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలు జిల్లా వ్యాప్తంగా ప్రతినిత్యం సంబరంగా నిర్వహించడం జరుగుతుందని అధికార యంత్రాంగం పనితీరు ఎంతో బాగుందని అభినందించారు. ప్రభుత్వం సూచించిన విధంగా ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమాన్ని ఎలాంటి లోటుపాట్లు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిచేలా కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, సెర్ప్ సిబ్బందికి పెద్ద మొత్తంలో వేతనాలు పెంచడం జరిగిందని, ఆర్థికంగా రాణించేలా కృషి చేశారని అన్నారు. గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతున్నదని, రక్తహీనత నియంత్రణకు కెసిఆర్ న్యూట్రిషన్ కిట్, అలాగే ప్రసవానంతరం రూ.13 వేలు, కేసీఆర్ కిట్ అందించడం జరుగుతున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం ఒంటరి మహిళల పింఛన్, కల్యాణలక్ష్మి, ఆరోగ్య లక్ష్మి, కేసీఆర్ కిట్, న్యూట్రీషన్ కిట్, ఆరోగ్య మహిళ, పోలీసు శాఖలో 33 శాతం రిజర్వేషన్, మార్కెట్ కమిటీల్లో రిజర్వేషన్, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు ఇస్తున్నారని వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళా అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నదని తెలిపారు. రక్తహీనత నియంత్రణకు ప్రభుత్వం పోషకాహారంతో కూడిన న్యూట్రిషన్ కిట్లను అందించడం జరుగుతుందని తెలిపారు. గిరిజన ప్రాంతాలలో మాత శిశు మరణాలను నియంత్రించేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు వివిధ యూనిట్ల స్థాపనకు బ్యాంకు రుణాలను మంజూరు చేయడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని తెలిపారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా ప్రతి మంగళవారం ప్రత్యేక వైద్య చికిత్సలను అందిస్తున్నామని తెలిపారు. మహిళలు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగపరచుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ కోరారు. అంతకుముందు పలువురు మహిళలు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సాధించిన విజయాలు, ఆర్థిక ఎదుగుదలను సమావేశంలో వివరించారు. అనంతరం స్త్రీ నిధి కింద 4కోట్లు, స్వయం సహాయ సంఘాలకు 12.46 కోట్ల రూపాయల చెక్కులను అందజేశారు. అనంతరం ఉత్తమ సేవలందిస్తున్న మహిళా ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాలు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎం తదితరులను శాలువా, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరి బాయి, డీసీసీబీ, జిల్లా గ్రంథాలయ చైర్మన్లు అడ్డి భోజారెడ్డి, రౌత్ మనోహర్, అదనపు ఎస్పీ శ్రీనివాస్‌రావు, జిల్లా మహిళా అధికారులు మిల్కా, సునీత కుమారి, కృష్ణవేణి, శ్రీవల్లి, మహిళలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, ఉద్యోగులు, అంగన్వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.



అభివృద్ధిని విస్మరించిన పాలకులను సాగనంపాలి

● బీజేపీ నియోజకవర్గ నాయకులు పవార్ రామారావు పటేల్

నవతెలంగాణ-భైంసా



గ్రామాల అభివృద్ధిని విస్మరించిన పాలకులను ప్రజలు సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందని బిజెపి నియోజకవర్గ నాయకులు పవర్ రామారావు పటేల్ అన్నారు. మహాజన్ సంపర్క్ యోజన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బిజెపి జెండాను ఆవిష్కరించి 9ఏళ్ల పాలనలో ప్రధాని నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధిని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెబుతూ కాలం గడుపుతోందన్నారు. హామీలు నెరవేర్చకుండా పూటకో మాట మాట్లాడడం కెసిఆర్‌కు అలవాటైందన్నారు. రుణమాఫీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. మండలంలో ఒక గ్రామానికి దళితబంధు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. ఇంటికో ఉద్యోగం, ఉద్యోగ భృతి, డబుల్ బెడ్ రూం నిర్మాణాలు మాటే లేదన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. సిద్దిపేట, సిరిసిల్ల ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి ఇక్కడ జరగలేదన్నారు. గ్రామాల్లో ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే సమస్యల పరిష్కారం వైపు దృష్టి సారించకుండా ఎమ్మెల్యే కాలం వెళ్లదీస్తున్నారన్నారు. మోడీ హయాంలోనే ఉపాధి హామీ, గ్రామ పంచాయతీలకు భారీగా నిధులతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బి గంగాధర్, ఎంపిటిసి రజాక్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బాలాజీ పటేల్, మాజీ సర్పంచ్ చక్రధర్ పటేల్, ఎంపిటిసి అశోక్, నాయకులు రామారావు, సంజీవరావు, సాయికృష్ణ, గంగారెడ్డి, శైలేష్, ప్రవీణ్, రాజారెడ్డి, గంగయ్య పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యకు యాజమాన్యం బాధ్యత వహించాలి



నవతెలంగాణ-ఖానాపూర్

బాసర ట్రిపుల్ ఐటీలో చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యకు యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బానావత్ గోవింద్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాసర ఆర్జియుకేటి విద్యార్థిని పియుసి ప్రథమ సంవత్సరం చదువుతున్న వడ్ల దీపిక ఆత్మహత్య యూనివర్సిటీ యాజమాన్యం చేసిన హత్యనే అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వ్యక్తిగత ప్రతిష్ఠ కోసం బాసర ట్రిపుల్ ఐటీ వర్సిటీ పేరును దిగజార్చుతున్నరని అన్నారు. విద్యార్థుల సమస్యలు పట్టని వైస్ ఛాన్సలర్, డైరెక్టర్లు తక్షణమే నైతిక బాధ్యత వహిస్తూ పదవుల నుండి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు సూర్యకాంత్, కాంబ్లే జాదవ్, అశోక్ నాయక్ ఉన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

నవతెలంగాణ-భైంసా



రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎస్ఆర్ గార్డెన్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళా సంక్షేమ దినోత్సవం జరుపుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్న ఉద్దేశమే ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్యేయమన్నారు. మహిళా సంఘాల సభ్యులకు గ్రూపుకు 10 లక్షల రూపాయల రుణాలను ఇస్తున్న ఘనత టిఆర్ఎస్ ప్రభుత్వానిదే నన్నారు. రాష్ట్రమేర్పడ్డాక పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించామని, అభివృద్ధిలో తెలంగాణ అగ్రగామిగా నిలిచిందన్నారు. అంగన్వాడి టీచర్లకు, మహిళా సంఘాలకు ఆర్థికంగా ప్రోత్సహించడం జరిగిందన్నారు. అనంతరం నియోజకవర్గంలోని అన్ని సంఘాలకు కలిపి 15కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ రుణాన్ని అందించారు. కోటి రూపాయల స్త్రీ నిధి చెక్కును పంపిణీ చేశారు. అనంతరం విధి నిర్వహణలో సేవలందించిన ఉద్యోగులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు, వివిధ మండలాల జడ్పిటిసిలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీడీవోలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుండి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. జిల్లాలో 1300 మంది విద్యార్థులు హాజరు కానున్నట్టు వెల్లడించారు. వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో ఆదిలాబాద్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ గజిటెడ్ నెంబర్ 1, టీఎస్ మోడల్ స్కూల్ (బోథ్), జడ్పీఎస్ఎస్ తెలుగు మీడియం ఉట్నూర్ ఉన్నట్లు వెల్లడించారు.

బీటీ రోడ్లకు భూమి పూజ



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలో ఐటీడీఏ నిధులతో బీటీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో పల్లెలకు, గూడాలకు వెళ్లడానికి సరిగా రోడ్డు కూడా లేని పరిస్థితులుండేవన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత రోడ్లు నిర్మించుకుంటున్నామన్నారు. కిష్టపూర్, శంకరపూర్, లింగట్ల గ్రామాలకు రెండు కోట్ల 43 లక్షల ఐటిడిఎ నిధులతో రోడ్లు నిర్మించుకుంటున్నామన్నారు. అనంతరం ఎంపీపీ సజన్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి మొట్టే కిరణ్‌కుమార్, జడ్పీటీసి అనిల్ జాదవ్, స్థానిక సర్పంచులు గీత, స్వర్ణాంజలి, మండల కన్వీనర్ శివారెడ్డి, ఎంపీటీసీలు, మండల నాయకులు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు

చర్లపల్లి గ్రామానికి చెందిన అయ్యాబాయి(25) అనారోగ్యంతో బాధపడుతూ పురుగులమందు తాగి మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మూడు సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన సోనేరావును ప్రేమ వివాహం చేసుకుంది. అప్పటినుండి ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఈ నెల 7న పురుగులమందు తాగింది. అదే రోజు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించినట్లు ఎస్సై అప్పారావు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీసీఆర్ కోర్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా దుర్గారాణి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కోర్టుకు వచ్చే కేసుల సత్వర పరిష్కారంలో న్యాయవాదులు కీలకపాత్ర పోషిస్తారని పీసీఆర్ కోర్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గారాణి అన్నారు. మంగళవారం ఆమె బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులతో సమావేశం ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్రాల నగేష్, చందుసింగ్, ఉపాధ్యక్షులు చంద్రకాంత్ చౌదరిలతో పాటు పలువురు న్యాయవాదులు మీటింగ్‌లో పాల్గొన్నారు. కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు న్యాయవాదుల సహకారం ఎంతో అవసరమని జడ్జి దుర్గారాణి అన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి తనవంతుగా పూర్తి సహకారం ఉంటుందని తెలియజేశారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్



నవతెలంగాణ-సారంగాపూర్

ఆటోలో మరిచిపోయిన సెల్ ఫోన్‌ను పోలీసులకు అందజేసి ఆటోడ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. మంగళవారం మండలంలోని కౌట్ల(బి) గ్రామానికి చెందిన కొత్తపల్లి నరేష్ తన ఆటోలో ఓ వ్యక్తి సోఫీనగర్ నుండి నిర్మల్ బస్టాండ్‌కి వచ్చే క్రమంలో సెల్ ఫోన్ ఆటోలోనే మర్చిపోయాడు. ఆటో డ్రైవర్ తన ఆటోలో లభించిన సెల్‌ఫోన్‌ను సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి పోలీసులకు అప్పగించాడు. దీంతో పోలీసులు పూర్తి విచారణ చేపట్టి ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి గురించి ఆరా తీసి బాధితుడికి అందజేస్తామని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. నిజాయితీని చాటుకున్న ఆటో డ్రైవర్ నరేష్‌ను పోలీసులు అభినందించారు.

పశువుల యజమానులకు నష్టపరిహారం అందజేత



నవతెలంగాణ-తాంసి

అటవీ జంతువుల దాడిలో మృతి చెందిన భీంపూర్ మండలం తాంసి-కే, భీంపూర్‌కు చెందిన పశువుల యజమానులకు మంగళవారం అటవీ శాఖ తరపున చెక్కులను బీట్ ఆఫీసర్ హైమద్‌ఖాన్ అందజేశారు. అన్నెల స్వామికి రూ.25వేలు, ప్రభాకర్‌కు రూ.12వేలు, మడావి శంకర్‌కు రూ.15వేలు, గొట్టిముక్కుల అశోక్‌కు రూ.16వేలు, నైతం శ్రావణ్‌కు రూ.15వేలు, సిడాం ప్రభుకు రూ.18వేలు చెక్కుల రూపంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం పులుల సంచారం ఉండటంతో పశువులు మేతకు వెళ్లిన సందర్భంలో దాడి చేశాయని తెలిపారు. దాడిలో మరణించిన పశువుల యజమానులకు అటవీశాఖ తరపున నష్టపరిహారం మంజూరైందని పేర్కొన్నారు.

విద్యావాలంటీర్లను రెన్యూవల్ చేయాలి

నవతెలంగాణ-దహెగాం



జిల్లావ్యాప్తంగా గత సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేసిన విద్యావాలంటీర్లను రెన్యూవల్ చేయాలని కోరుతూ విద్యావాలంటీర్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం డీఈఓ, ఎంఈఓ, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యావాలంటీర్ల సంఘం మండలాధ్యక్షుడు కంబాల నరేందర్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఉపాధ్యాయులతో పాటుగా విధులు నిర్వర్తిస్తూ విద్యనందించడం జరిగిందని, ఈ సంవత్సరం కూడా ఖాళీ ఉన్న పాఠశాలల్లో తమ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీవీల సంఘం నాయకులు విశ్వనాథ్, సత్యనారాయణ, రాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రేషన్ డీలర్ మృతి

నవతెలంగాణ-కోటపల్లి



చెన్నూర్ మండలంలోని బావురావుపేట సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రేషన్ డీలర్ బెల్లంపల్లి బుక్యాగౌడ్(57) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బావురావుపేట గ్రామానికి చెందిన బుక్యాగౌడ్ సోమవారం రాత్రి చెన్నూరు పట్టణానికి వెళ్లి తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలోని టోల్ ప్లాజ వద్ద మంచిర్యాల నుంచి చెన్నూరుకు వస్తున్న టెంపో టాక్స్ అతివేగంగా వచ్చి బుక్య గౌడ్ వేగంగా ఢీకొండంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎలక్కపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సౌజన్య తెలిపారు.

విత్తన దుకాణాల్లో విస్తృత తనిఖీలు



నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని పత్తి విత్తన దుకాణాలను మంగళవారం మండల వ్యవసాయ అధికారి మహేందర్ విస్తృత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలను అమ్మినట్లు తెలిస్తే చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. పత్తి ప్యాకెట్ ధర గరిష్ఠ విక్రయ ధర రూ.853 కంటే ఎక్కువ ధరకు అమ్మితే కఠినమైన చర్యలు తీసుకుంటామని, అలాగే విత్తనాలను అమ్మిన వెంటనే రైతుకు రసీదు ఇవ్వాలని అన్నారు. ఏ డీలర్ అయితే రైతుకు రసీదు ఇవ్వరో అవి నకిలీ విత్తనాలుగా గుర్తించి కఠినమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే నిషేధిత పత్తి గింజలను అమ్మినట్లయితే చట్టపరంగా శిక్షకు అర్హులవుతారని, ఎవరైనా అమ్మినట్లు తెలిసిన, అమ్మటానికి ప్రోత్సహించిన తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.

కాగజ్‌నగర్ రూరల్ : రైతులకు ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే షాపు లైసెన్సులు రద్దు చేస్తామని వ్యవసాయ శాఖ కాగజ్‌నగర్ ఏడీఏ మనోహర్, ఏఓ రామకృష్ణ హెచ్చరించారు. మండలంలోని పలు ఎరువుల, విత్తనాల దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. ఏకంపెనీ ప్యాకెట్లను కూడా రూ.853 లకు మించి అమ్మకూడదని అన్నారు. డీలర్లు ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు విత్తనాలు కొనుగోలుపై ఎలాంటి సమస్యలు ఉన్న మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని అన్నారు. రైతులకు విత్తనాలు అమ్మే సమయంలో తప్పకుండా రశీదు ఇవ్వాలని అన్నారు. ఎవరైనా డీలర్లు, విత్తనాల కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మితే వ్యవసాయశాఖకు తెలపాలని కోరారు. రైతులకు నాణ్యమైన, మంచి దిగుబడి ఇచ్చే విత్తనాలను మాత్రమే అమ్మాలని డీలర్లకు సూచించారు. రైతులను ఇబ్బంది పెట్టే చర్యలు కానీ, రైతులను మోసం చేసే విత్తనాలను అమ్మి వారికి ఇబ్బంది కలుగజేయవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రామకృష్ణ పాల్గొన్నారు.

పాత కలెక్టరేట్‌ను గర్ల్స్ హాస్టల్‌కు ఇవ్వాలి



నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల జిల్లా కేంద్రాల్లోని పాత కలెక్టరేట్ భవనాన్ని గర్ల్స్ హాస్టల్‌కి కేటాయించాలని మంగళవారం వామపక్ష విద్యార్థి సంఘాలన నాయకులు నూతన కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2016 సంవత్సరం నుంచి పాత కలెక్టరేట్ కార్యాలయాన్ని ఎస్సీ గర్ల్స్ హాస్టల్ కేటాయించాలని అనేక సందర్భాల్లో విద్యార్థి సంఘాలు ఉద్యమాలు చేసినప్పటికీ అధికారులను ఎమ్మెల్యేలను, కలిసి వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదని అన్నారు. అధికారులను ప్రజాప్రతినిధులను కలిసినప్పుడు ఇస్తానని చెప్పి ఇప్పటివరకు ఇవ్వకుండా ఇతర శాఖలకు కేటాయిస్తామని చర్చ జరుగుతుందని ఆరోపించారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి పాత కలెక్టర్ కార్యాలయాన్ని గర్ల్స్ హాస్టల్‌కు కేటాయించాలని వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు కోరారు. లేనిపక్షంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాగం శ్రీకాంత్, మిట్టపల్లి తిరుపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల సన్నీ గౌడ్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి దళితబంధు ఇవ్వాలి



నవతెలంగాణ-జన్నారం

ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు ఇవ్వాలని కాంగ్రెస్ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్ వినోద్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దళితులతో మండల తహసీల్దార్ రాజకుమార్‌కు దళిత బంధు దరఖాస్తులను అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 29 గ్రామపంచాయతీలలో కేవలం ఒక్క గ్రామ పంచాయతీలో ఉన్న కొందరు దళితులకు మాత్రమే దళిత బంధు ఇప్పించి మిగతా గ్రామాలలో ఉన్న దళితులను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసింద అన్నారు. అన్ని గ్రామాలలో ఉన్న దళితులకు తప్పకుండా దళిత బందును వర్తింపజేసి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు. దళిత బంధులో అక్రమ వసూళ్లు, చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి పసియుల్లా, ఉపాధ్యక్షుడు అంబటిపెల్లి మహేష్, దాముఖ కరుణాకర్, జిల్లా నాయకులు మామిడిపల్లి ఇంద్రయ్య, దుమల రమేష్, మంద రాజేష్, హేమంత్ ఆచారి, బాదావత్ తిరుపతి, గంగన్న యాదవ్, పోషమాలు లింగన్న పాల్గొన్నారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

నవతెలంగాణ-వేమనపల్లి

వేమనపల్లి మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం కోరం లేక వాయిదా పడింది. రెండు గంటలు వేచి ఉన్నప్పటికీ సరిపడా సభ్యులు రాకపోవడంతో వాయిదా వేశారు. మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11.00 గంటలకు ఏర్పాటు చేశారు. సమావేశం జరగదన్న సమాచారం ఉందో తెలియదుగానీ, అధికారులే తాపీగా 11.30 గంటలకు రావడం కనిపించింది. సభ్యులు సమావేశానికి హాజరుకాలేదు. 12.00 గంటల సమయం అయినప్పటికీ సమావేశానికి సరిపడా సభ్యులు హాజరు కాలేదు దాంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ ప్రకటించారు.

ఏసీబీ వలలో అవినీతి తిమింగలాలు

- లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైద్యారోగ్య శాఖ సిబ్బంది



నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని గుడిపేట చందనాపూర్‌లో గల జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం ముగ్గురు అధికారులు లంచం తీసుకుంటుండగా ఏసీబీకి పట్టుబడ్డారు. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ భద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లికి చెందిన రామ్ సాగర్ (ఎన్‌హెచ్ఎస్) నేషనల్ హెల్త్ స్కీమ్‌కి అద్దెకారులను నడిపిన యజమానికి 6 నెలల బిల్లు రూ.1.96 లక్షలను గతంలో జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన షఫీద్దీన్‌ను సంప్రదించి కారు అద్దె బిల్లును అడగగా అతను రూ.10వేలు లంచం డిమాండ్ చేశాడు. సదరు కారు యజమాని ఇటీవల బిల్లు కోసం సీనియర్ అకౌంటెంట్ దీపికను సంప్రదించగా ఆమె షఫీయోద్దీన్ రూ.10వేలు లంచం ఇవ్వమన్నాడని తెలిపింది. దీంతో అతను ఇక్కడ లేడు కదా నేను ఎందుకు ఇవ్వాలని అడగగా ఆమె వెంటనే షఫీయోద్దీన్‌కి చరవాణిలో సంప్రదించి అతని ముందే రూ.10వేలు లంచం ఇవ్వాలని చెప్పడంతో అతను ఏసీబీ అధికారులను సంప్రదించాడు. దీంతో పథకం ప్రకారం ఏసీబీ అధికారుల సూచన మేరకు మంగళవారం డబ్బులు ముట్టజెప్పడానికి కారు యజమాని కార్యాలయానికి రాగా అకౌంటెంట్ దీపిక బిజీగా ఉండడంతో అక్కడే పని చేసే మరో అకౌంటెంట్ రాజనర్సును బయటకు పంపించింది. రాజనర్సు రూ.10వేలు లంచం డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా రామగుండం సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న షఫీయోద్దీన్ సూచన మేరకు తీసుకున్నామని తెలపడంతో అతన్ని విచారణ నిమిత్తం మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి తీసుకువచ్చారు. విచారణ అనంతరం లంచం తీసుకున్నట్లు నిర్ధారణ అయిందని ఏసీబీ డీఎస్పీ భద్రయ్య తెలిపారు. విచారణ అనంతరం నిందితులను కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ దాడిలో ఏసీబీ ఇన్స్‌పెక్టర్‌లులు సునీల్‌కుమార్, జాన్‌రెడ్డి, రవీందర్, తిరుపతి పాల్గొన్నారు.

భూ సర్వేపై రైతుల ఆందోళన

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండల కేంద్రం నుంచి కర్జెల్లి వెళ్ళే ప్రధాన రోడ్ పక్కన ఉన్న రైతుల భూముల్లో రెవెన్యూ సర్వే అధికారులు, సిబ్బంది ఎలాంటి సమాచారం ఇవ్వకుండా భూ సర్వేలు చేపట్టారు. అక్కడ భూముల కొలతలు చేసే ప్రయత్నం చేస్తుండగా విషయం తెలుసుకున్న పట్టాదారు రైతులు అక్కడకు చేరుకున్నారు. సర్వే కోసం వచ్చిన అధికారులను ఎందుకు సర్వే చేస్తున్నారని నిలదీశారు. దీంతో మొదట స్థానిక సర్వేయర్ శ్రీనివాస్ రైతులకు ముందుగానే నోటీస్‌లు ఇచ్చామని చెప్పారు. దీంతో మండిపడిన రైతులు ఏ రైతుకు నోటీస్ ఇచ్చారో చూపించాలని పట్టు బట్టారు. దీంతో కొందరు రైతులకు నోటీస్‌లు ఇచ్చినట్లు సర్వేయర్ చూపెట్టగా అందులో సంతకాలు తమవి కాదని, నోటీస్ పేపర్లు మొత్తం చూపెట్టాలని పట్టుబట్టారు. అధికార పార్టీ నాయకులకు మేలు చేసేందుకే రెవెన్యు అధికారులు ఇలా నోటీస్ ఇవ్వకుండా సర్వే చేస్తున్నారని ఆరోపించారు. ప్రధాన రోడ్ పక్కన దళితుల భూమి ఉండడంతో రాజకీయ నాయకులు తమకి అడ్డు లేకుండా చూసుకునేందుకు బోగస్ మంత్రాలతో అధికారులతో సర్వే చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు నోటీసులు చూపెట్టకుండానే మరోసారి నోటీసులు ఇచ్చిన తర్వాత సర్వే చేస్తామని చెబుతూ అధికారులు వెనుదిరిగారు. ఇదే విషయంపై తహసీల్దార్ మన్సూర్ అలీని వివరణ కోరగా ఎక్కడా ఏ సమస్యా గొడవా జరగలేదని, అయినా సర్వేలతో తనకు ఎటువంటి సంబంధం లేదని చెప్పారు.

స్వరాష్ట్రంలో మహిళలకు పెద్ద పీట



నవతెలంగాణ-కౌటాల

స్వరాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన దశాబ్ది ఉత్సవ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలో 35వేల పింఛన్‌లు ఉండగా అందులో సుమారుగా 25 వేల వరకు మహిళలకే పింఛన్ అందుతుందన్నారు. ఆడబిడ్డ పుట్టినప్పటి నుంచి పెండ్లి చేసే వరకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందన్నారు. ఆడబిడ్డ పుట్టితే కేసీఆర్ కిట్టు కింద రూ.13 వేలు అందించి అంబులెన్స్‌లో ఇంటి వద్ద దించుతుందన్నారు. పెళ్లి వయసు వచ్చిన తర్వాత పెళ్లి చేస్తే కళ్యాణలక్ష్మి పథకం కింద రూ.లక్ష నూటపదహార్లు అందజేస్తోందన్నారు. వితంతులకు పింఛన్ మంజూరు చేసి ఆదుకుంటోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలకు అండగా నిలిచిందన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని మర్చిపోకుండా మరోసారి అధికారంలోకి తెచ్చుకోవలసిన బాధ్యత అందరిపై ఉంది అన్నారు. అదేవిధంగా రైతులకు రైతుబంధు అందిస్తోందని అన్నారు. రైతు సాధారణ మరణం చెందితే రైతు బీమా రూ.ఐదు లక్షలు అందచేస్తుందన్నారు. అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందని పేర్కొన్నారు. దళారుల చేతికి పోకుండా కేసీఆర్ ప్రభుత్వం అందజేస్తున్న ప్రతి రూపాయి లబ్దిదారుని ఎకౌంట్లో జమ అవుతుందని అన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బసర్కర్ విశ్వనాథ్ తహసీల్దార్ సాయన్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆదే వసంతరావు వైస్ ఎంపీపీ నికోడే అమ్మక్క రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు మెరుపల్లి బ్రహ్మయ్య ఎంపీడీఓ నసురుల్లా ఖాన్ ఎస్సై ప్రవీణ్ కుమార్ కౌటాల సర్పంచ్ ఒజ్జల మౌనిష్ పాల్గొన్నారు.

టర్మినేట్ చేసిన ఉద్యోగులకు మళ్లీ పోస్టింగ్ ఇవ్వటం సరికాదు

- విద్య వ్యవస్థని భ్రష్టు పట్టిస్తున్నా జిల్లా అధికారులు
- డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు చాపిడి పురుషోత్తం



నవతెలంగాణ-రెబ్బెన

జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణంలోని ఆర్‌ఆర్‌డీ కాలని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం(కేజీబీవీ)లో పనిచేస్తున్న వారిని నర్మినేట్ చేసి ఉద్యోగులకు మళ్లీ పోస్టింగ్ ఇవ్వడం సరికాదని డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు చాపిడి పురుషోత్తం మండిపడ్డారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు కాంట్రాక్టు ఉద్యోగులను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఆ విద్యాలయంలోని 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎస్. ఐశ్వర్య 2022 సెప్టెంబరు 7న తీవ్రజ్వరంతో బాధపడుతూ మృతిచెందగా.. ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ ఎస్ఓ, సీఆర్టీ, ఏఎన్ఎంలపై బాధిత విద్యార్థిని తల్లిదండ్రులు విద్యార్థి యువజన సంఘాలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఆ ముగ్గురిని విధుల నుంచి అదేరోజు తొలగించారు. వారికి జిల్లా పరిధి ఇతర మండలాల్లోని కస్తూర్బాలో కాంట్రాక్టు పద్ధతిలో మళ్లీ పోస్టింగ్ ఇస్తూ ఈ నెల 8న విద్యాశాఖ కార్యదర్శి ఎ.శ్రీదేవసేన ఉత్తర్వులు జారీ చేయడం దేనికి సంకేతం విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవడమే అవుతుందన్నారు. ఇటు జిల్లా విద్యాశాఖాధికారులు అటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు విద్య వ్యవస్థని భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. టర్మినెంట్ అయిన వారికి మళ్లీ పోస్టింగ్ ఇవ్వడం విడ్డూరంగా ఉందని, పి.స్వప్న ఎస్ఓగా తిర్యాణి మండలంలోని మానిక్యాపూర్(కేజీబీవీ), జి.శ్రీలత సీఆర్టీగా చింతలమానేపల్లి, సీహెచ్.భారతి ఏఎన్ఎంగా సిర్పూర్(టి) కేజీబీవీలో ఖాళీ పోస్టుల్లో భర్తీకి విద్యాశాఖ ఆదేశాలు ఇచ్చినట్లు అనుమానాలు వెల్లువెత్తుతున్నాయన్నారు. ఒకవేళ అదే నిజమైతే విద్యార్థులను కలుపుకొని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. టర్మినెంట్ అయిన వారికి కాంట్రాక్ట్ పద్ధతిలో ఉత్తర్వులు జారీచేసిన దానిని విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ పోస్టుల భర్తీ కోసం ప్రోత్సహించిన విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు చల్లూరి వంశి, నాయకులు చాపిడి తిరుపతి పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-మందమర్రి



మండల కేంద్రానికి చెందిన పూల బాపు ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి కిందబడి వెన్ను విరిగి రెండు కాళ్ల పనిచేయక ఇబ్బంది పడుతున్న బాదితుడికి జీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాజా రమేష్ బాబు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. బాదితుడి ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.3 వేల ఆర్థిక సాయంతో పాటు 25 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాగర్, అక్షయ్, భార్గవ్, వేణు, కిషోర్, కిరణ్, సత్యం, ప్రశాంత్, జీఎస్ఆర్ ఫౌండేషన్ మిత్రబందం ఉపులపు సురేష్, కిరణ్, మహేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

వృద్ధాప్య పింఛన్ రూ.వెయ్యి పెంచాలి



నవతెలంగాణ-జన్నారం

వికలాంగులకు పెంచిన విధంగా, వద్దులకు రూ.1000 పెన్షన్ పెంచాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ మండల అధ్యక్షుడు లెక్కల మల్లయ్య అన్నారు. మంగళవారం మండలంలోని కిస్టాపూర్ గ్రామపంచాయతీలో ఆ గ్రామ సీనియర్ సిటిజన్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ సీనియర్ సిటిజన్స్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా అవుజోజుల వెంకటస్వామి, ఉపాధ్యక్షులుగా వాసాల పొచమల్లు, కార్యదర్శిగా అట్టే నారాయణ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి బంగారు తెలంగాణగా మార్చి వయోవృద్దుల సంక్షేమానికి పలు కార్యక్రమాలు చేపడుతున్న సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర జనాభలో 10 శాతం ఉన్న వయోవృద్దులు తమ శేష జీవితాన్ని ప్రశాంతంగా గడిపేందుకు వయొవృద్దుల "ఆసరా పింఛన్" ను రూ.3016.00గా ప్రకటించి అంతిమదశలో వున్న వారిని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ తెలంగాణ సీనియర్ సిటిజన్స్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ భాస్కర్ రాజు, జిల్లా ట్రిబునల్ మెంబర్ అన్నె కాంతమణి, కార్యదర్శి నోముల లక్ష్మణ్, ప్రచార కార్యదర్శి మారుతి సతీష్, గౌరవ సలహాదారు నోముల రాజమౌళి, అన్నం సత్యనారాయణ పాల్గొన్నారు.

బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి



నవతెలంగాణ-కెరమెరి

బడి బాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సెక్టోరియల్ అధికారులు రాథోడ్ సుభాష్, శ్రీనివాస్, సత్తయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు కార్యక్రమానికి సంభందించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పాఠశాలల్లో చేపట్టిన కార్యక్రమాల కలబోతనే తొలిమెట్టు కార్యక్రమమని ప్రధానోపాధ్యాయులు గమనించాలన్నారు. వివిధ పాఠశాలల్లో అమలు చేస్తున్న తొలిమెట్టు కార్యక్రమ ఉత్తమ బోధన విధానాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన ఉపాధ్యాయులకు తొలిమెట్టు కార్యక్రమం అమలుచేయవల్సిన విధానాలను ఉపాధ్యాయులకు గమనించారు. తొలిమెట్టు కార్యక్రమం గత సంవత్సరంలో విజయవంతం అయిందని తెలిపారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. పోస్టర్లను పాఠశాల గోడలకు అతికించి తల్లిదండ్రులకు, ఎస్ఎంసీ సభ్యులకు కార్యక్రమం ఆవశ్యకతను తెలియజేయాలన్నారు. గతంలో బోధన బాగా జరిగినప్పటికీ తొలిమెట్టు వచ్చినప్పటినుండి బోధనోపకరణాల వాడకం చాలా పెరిగిందని తెలిపారు. పాఠశాల ప్రారంభంలో విద్యార్థుల తల్లిదండ్రుల ముందు వారి ప్రగతిని ప్రదర్శించాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల శారీరకంగా మాత్రమే కాకుండా మానసికంగా కూడా బలంగా ఉన్నపుడే బోధన ఉత్తమంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మండల నోడల్ అధికారి ఆడె ప్రకాష్ పాల్గొన్నారు.

బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పలు గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ తెలిపారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న రహదారుల పనులకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాల్సి ఉందని అన్నారు. మొత్తం 13.08 కోట్ల నిధులతో పనులు చేపట్టనున్నట్లుగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. పొన్కల్ గ్రామపంచాయతీ పరిధిలోని గోండుగూడ నుంచి చెరుకుగూడ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.1.80 కోట్లు, కవ్వాల్ రాంతండా నుంచి సోనాపూర్ తండా వరకు రూ.4.37, రేండ్లగూడ ఆర్అండ్ బీ రోడ్డు నుంచి రూపాయక్ తండా వరకు రూ.1.91 కోట్లు, చింతగూడ ప్రధాన రహదారి నుంచి శ్రీలక్ష్మిదేవీ ఆలయం వరకు రూ.2.21 కోట్లు, తపాల్పూర్ ప్రధాన రహదారి నుంచి మల్లన్న ఆలయం వరకు రూ.1.86 కోట్లు, హాస్టల్ తండా నుంచి నాయకపు గూడ వరకు రహదారి నిర్మాణానికి రూ.93 లక్షలు మంజూరైనట్లు వివరించారు.

ముగిసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం



నవతెలంగాణ-మందమర్రి

డబ్ల్యూ పీఎస్, జీఏ వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వారి ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో సాయంత్రం 7 గంటలకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందమర్రి ఏరియా జీఎం మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందమర్రి, బెల్లంపల్లి, సోమగూడెం, రామకృష్ణాపూర్ స్టేడియాలలో వాలీబాల్, అథ్లెటిక్స్, ఫుట్బాల్ వంటి క్రీడలలో నిష్ణాతులైన కోచ్‌లను నియమించి 160 మంది పిల్లలకు ఆయా క్రీడల్లో శిక్షణ ఇచ్చారని అన్నారు. శిక్షణ పొందిన విద్యార్థిని విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించాలని క్రీడలు మానసిక ఉల్లాసానికే కాకుండా శరీర ధృఢత్వానికి, ఆరోగ్యంగా ఉండటానికి తోడ్పడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, టీబీజీకేఎస్ నాయకులు సీవీ రమణ, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సాలేంద్ర సత్యనారాయణ, అధికారుల సంఘం కన్వీనర్ పైడి ఈశ్వర్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, స్పోర్ట్స్ ఆనర్ సెక్రెటరీ సంఘమిత్ర, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ చిన్నయ్య, గ్రౌండ్ ఇన్‌ఛార్జి తిరుపతి పాల్గొన్నారు.

అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
4
బుధవారం 14 జూన్ 2023

కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. రెండో రోజు ఆంగ్ల పరీక్ష సందర్భంగా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీధర్ సుమన్ వివరాలు వెల్లడిస్తూ రెండో రోజు ఉదయం జిల్లా వ్యాప్తంగా జనరల్ 491, ఒకేషనల్ 33 మొత్తం 524 మంది విద్యార్థులకు గాను జనరల్ 462, ఒకేషనల్ 28 మంది హాజరయ్యారని, మొత్తం 34 మంది గైర్హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం జనరల్ 166, ఒకేషనల్ 17 మొత్తం 183 మంది విద్యార్థులకు జనరల్ 161, ఒకేషనల్ 15 మంది హాజరయ్యారని, మొత్తం 7గురు గైర్హాజరయ్యారన్నారు. పరీక్షల నిమిత్తం 8పరీక్షా కేంద్రాలున్నాయన్నారు. మంగళావారం డీఈసీ బృందం జిల్లా కేంద్రంలో పలు కేంద్రాలను పరిశీలించారన్నారు. పరీక్షల సందర్భంగా జిల్లా స్థాయిలో డీఐఈఓ కార్యాలయంలో కంట్రోల్ రూం ను ఏర్పాటు చేశారని, హాల్ టికెట్ తదితర సమస్యలుంటే కంట్రోల్ రూం నెం.08733-293713కి కాల్ చేసి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

బలహీన వర్గాలుగా చెప్పబడే బీసీలకు గతంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని తెలంగాణ బలహీనవర్గాల సంక్షేమ సంఘం(టీబీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు అడ్వకేట్ రాజలింగు మోతె అన్నారు. మంగళవారం మంచిర్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తులు చేసే వారికి రూ.లక్షతో పాటు, జనాభా ధమాషా ప్రకారం నిధులు కేటాయించాలని అన్నారు. అలాగే బీసీ సబ్‌ప్లాన్, కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు, ఎంబీసీ కార్పొరేషన్‌కి రూ.వెయ్యి కోట్లు, ప్రతి కుల ఫెడరేషన్‌కు రూ.100 కోట్లు, సంచార జాతుల ఫెడరేషన్‌కు రూ.100 కోట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో టీబీఎస్-ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అడ్వకేట్ మోతె రవికుమార్, బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

17న బహిరంగసభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టే రాష్ట్ర జీపు జాతా వస్తున్న సందర్భంగా ఈ నెల 17న ఆసిఫాబాద్‌లో నిర్వహించే బహిరంగసభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ కోరారు. మంగళవారం జీపు జాతా బహిరంగసభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు 45వ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసుల ప్రకారం కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని కోరుతూ ఆలిండియా అంగన్‌వాడీ యూనియన్ పిలుపు మేరకు రాష్ట్ర జీపు జాతాను 17న ఆసిఫాబాద్‌లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ నెల 10 నుండి 13 వరకు అంగన్‌వాడీ కేంద్రాల సర్వే చేపట్టినట్లు తెలిపారు. 15 నుండి స్థానిక సమస్యలపై ప్రాజెక్టు సీడీపీఓలకు వినతిపత్రాలు ఇవ్వనున్నామని అన్నారు. 16న ఆదిలాబాద్‌లో ప్రారంభమై జీపు జాతా 17న ఆసిఫాబాద్‌కు వస్తున్నందున ఆ రోజు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు తమ సమస్యలను జీపు జాతా దృష్టికి తీసుకురావాలని సూచించారు. జులై పదో తేదీన కోరికల దినం పాటిస్తూ నల్ల చీరలు ధరించి పది కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కృష్ణమాచారి, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ త్రివేణి, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షురాలు వనిత, కోశాధికారి వై అరుణ, నాయకులు రజిత, కృష్ణవేణి, జయ మండల్ ఉమాదేవి, హేమలత, మల్లీశ్వరి పాల్గొన్నారు.

ఆగస్టులో సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు



నవతెలంగాణ-జైపూర్

ఎట్టకేలకు సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు ఆగస్టు నెలలో నిర్వహించేందుకు ముహూర్తం నిర్ణయమైందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. ఈ సంధర్భంగా మంగళవారం డిప్యూటీ చీఫ్ లేబర్ కమీషనర్ సమక్ష్యంలో సింగరేణి డైరెక్టర్(పా)తో సమావేశమైనట్లు తెలిపారు. సమావేశంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల అగ్రిమెంట్ అమలుకు చర్యలు డిప్యూటీ చీఫ్ లేబర్ కమీషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. గత సమావేశాల్లో కూడా కాంట్రాక్టు కార్మికుల అగ్రిమెంట్ విషయమై చర్చించినట్లు తెలిపారు. గత అగ్రిమెంట్ల ప్రకారం కాంట్రాక్టు కార్మికులకు బోనస్ అమలు, నర్సరీ కార్మికులకు కనీస వేతనం చెల్లించటం, కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలకు ఈఎస్ఐ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందించడానికి సింగరేణి డైరెక్టర్ హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలపై జూన్ 24న మరో మారు సమావేశం కావడంతో పాటు అదే రోజు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తూ ఆగస్టులో ఎన్నికలు నిర్వహించుటకు అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

కుమురంభీం విగ్రహావిష్కరణ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-బెజ్జూర్

కుమురం భీం విగ్రహావిష్కరణ కమిటీని మంగళవారం మండల కేంద్రంలో వీటీడీఏ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు కురిసింగ ఓం ప్రకాష్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా సడెం సకారం, ఉపాధ్యక్షులుగా తోరెం బానయ్య, నైతం శంకర్, పెద్దల శంకర్, ప్రధాన కార్యదర్శిగా కోర్తె తిరుపతి, సహాయ కార్యదర్శులుగా కోర్తె లాలయ్య, కోర్తె మహేష్, తోరెమ్ శంకర్, ప్రచార కార్యదర్శిగా ఎలాది చంద్రశేఖర్, ఆత్రం అశోక్, కోశాధికారిగా అనిల్, సంయుక్త కార్యదర్శిగా పురుషోత్తం, సలహాదారులుగా ఇంజరి రాజారాం, శంకర్‌తో పాటు మరో 30 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ మండల కేంద్రంలో కొమురం విగ్రహావిష్కరణ, ఆదివాసి భవన్ ప్రారంభోత్సవానికి కృషి చేస్తుందని తెలిపారు. ఆదివాసీలు ఐక్యంగా ఉండాలని కోరారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్





మహిళల సంక్షేమానికి ప్రభుత్వం అహర్నిశలు కషి చేస్తోందని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం నిర్వహించిన మహిళ సంక్షేమ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఒడ్డేపల్లి ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, జిల్లా పరిషత్ చైర్మన్ కోవ లక్ష్మీ, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు తరువాత గత తొమ్మిది సంవత్సరాల కాలంలో మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని, తెలంగాణ ఆడబిడ్డల పెండ్లికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయంతో పాటు వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.2 వేల 16 పింఛన్ అందిస్తోందని గుర్తు చేశారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి పథకంలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, సమగ్ర శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్ వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు ఒక పూట భోజనము, 6 సంవత్సరాల లోపు పిల్లలకు పౌష్టిక ఆహారం అందిస్తోందని వివరించారు. సెర్ప్, ఐకెపి ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు ఆర్థికంగా ఎదిగేందుకు గ్రూపు రుణాలు, స్త్రీనిధి రుణాలు అందించే ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పడుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవం అయిన మహిళలకు కేసీఆర్ కిట్, గర్భిణుల ఆరోగ్య దృష్ట్యా న్యూట్రిషన్ కిట్ అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను గుర్తించి మెరుగైన వైద్యం అందించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య మహిళా కేంద్రాలను నెలకొల్పారని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశ వర్కర్లకు వేతనాలు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. మహిళా ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రసూతి సెలవులు పెంచడం జరిగిందని, సమాజంలో మహిళలు గౌరవంగా జీవించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టిందని, సఖి కేంద్రాల ద్వారా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా కషి చేస్తున్నామని, పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహిళల రక్షణ కొరకు షీ టీమ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను నియంత్రించడం జరిగిందని అన్నారు. చట్టసభలలో మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్లు పెంచి వారిని భాగస్వామ్యం చేయడంతో మహిళలు ఎన్నో పదవులు అనుభవిస్తున్నారని తెలిపారు. బాలికల విద్యపై ప్రభుత్వం ఎన్నో విద్యాలయాలు, గురుకులాలను స్థాపించి విద్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. జిల్లాలో పోషకాహార లోపం నియంత్రించడంలో అంగన్వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. జిల్లా అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని 890 మహిళా గ్రూపులకు రూ.1 కోటి 50 లక్షల చెక్కును జిల్లా సమాఖ్యకు అందజేశారు. అనంతరం మహిళా అధికారులు, ఉద్యోగులు, షీ టీమ్ సభ్యులను సన్మానించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు మహిళ సంక్షేమం, తెలంగాణ చరిత్రపై ఆలపించిన గీతాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి సావిత్రి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మణెమ్మ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శశికళ, జడ్పీటీసీ నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ పాల్గొన్నారు.



సమస్యలపై స్పందించని ప్రజాప్రతినిధులు



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కార్మికుల గత సమస్యలపై ప్రజాప్రతినిధుల స్పందన కరువైందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ-3 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో సింగరేణి కార్మికులను బార్డర్ సైనికులతో పోల్చే ప్రజాప్రతినిధులు ఏరియాలోకి వచ్చినప్పుడు మాత్రం ఇచ్చిన హామీలు కార్మిక సమస్యలపై స్పందించడానికి వెనుకడుగు వేస్తున్నారని తెలిపారు. సమస్యలపై ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకులను అరెస్టులు చేపిస్తున్నారని విమర్శించారు. ఇటీవల సీఎం కేసీఆర్ మంచిర్యాల పర్యటన నిమిత్తం కార్మిక సమస్యలపై స్పందించాలని కరపత్రం ఇచ్చినా.. బహిరంగ లేఖ రాసిన ఇచ్చిన హామీలను సైతం ప్రస్తావించలేదని విమర్శించారు. అన్ని యూనియన్లు కలిసి చేసిన అగ్రిమెంట్లను సైతం సింగరేణిలో అమలు చేయడం లేదని కార్మిక సంఘాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే విలువ ఇదేనా అని ప్రశ్నించారు. మరోవైపు లాభాలు రూ.700 కోట్లు పంచుతామని చెప్పిన సీఎం సింగరేణి నిజంగా లాభాల్లో ఉన్నట్లయితే వెంటనే ప్రకటించాలని అన్నారు. సంస్థ ఆర్థిక పరిస్థితి బాగానే ఉందని చెబుతున్న అధికారులు వెంటనే లాభాలు కార్మికులకు పాఠశాలలు తెరిచే సమయానికి పంచాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో ఎన్నికలలో రెండు ఓట్లను ప్రవేశపెట్టాలని రెండు సంవత్సరాల కాల పరిమితి అయితేనే యూనియన్లు కార్మిక సమస్యలను పట్టించుకొని పరిష్కరిస్తాయని అన్నారు. ఇప్పటికైనా మారు పేర్లు, డిపెండెంట్‌ల వయసు పెంపు, ఇతర లేబర్ కమిషన్ అగ్రిమెంట్లతో పాటు అధిక ఆదాయపన్నుతో సతమవుతూ కార్మికులకు కోల్ ఇండియాలో 2011లో చేసిన అగ్రిమెంట్ ప్రకారం అలవెన్సులపై ఐటి మాఫీని చేయమని సంస్థను ఆదేశించాలని డిమాండ్ చేశారు. అలాగే గతంలో శ్రీరాంపూర్ సమావేశంలో ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన సొంతింటి పథకంపై స్పందించలేదని, రేపు ఎన్నికల్లో వారి ప్రజాప్రతినిధులు ఏ విధంగా గనులపై ప్రచారం చేస్తారో కార్మికులందరూ ప్రశ్నించాలని అన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు మిడివెల్లి శంకర్, ఉపాధ్యక్షులు గుల్ల బాలాజీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కస్తూరి చంద్రశేఖర్, ఆర్కే న్యూటెక్ ఫిట్ సెక్రటరీ అజయ్, సీనియర్ నాయకులు గంగాధర చారి పాల్గొన్నారు.

నిరుద్యోగులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని నిరుద్యోగులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కనక యాదవ రావు సూచించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుమురంభీం జిల్లా వ్యాప్తంగా 15 మండలాలలో ఒక్కొక్క గ్రామపంచాయితీని పరిశీలించి ఎక్కడ అత్యవసరం ఉందో అట్టి గ్రామపంచాయితీలలో మినీ గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే మినీ గ్రంథాలయం కావలసిన గ్రామాలకు సంబంధించిన నివేదిక జిల్లా అధికారులకు, ఉన్నతాధికారులకు సమర్పించినట్లు తెలిపారు. నిరుద్యోగ యువత ఎక్కువ ఉన్న ప్రాంతాలను గుర్తించి మినీ గ్రంథాలయాలు ప్రారంభిస్తామన్నారు. త్వరలో ప్రారంభించబోయే గ్రంథాలయాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలో పాఠకుల సౌకర్యార్థం రూ.1.5 కోట్లతో నిర్మిస్తున్న నూతన గ్రంథాలయాన్ని రెండు నెలల్లో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామని, అన్ని రకాల అధునాతన వసతులతో సిద్ధమవుతుందన్నారు. గ్రంథాలయ నిర్మాణం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మండల గ్రంథాలయలకు చాలా చోట్ల సొంత భవనాలు లేవని వాటికోసం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించామని జిల్లా ప్రజా ప్రతినిధుల సహాయ సహకారాలతో త్వరలోనే నూతన భవనాలు నిర్మించుకోవడం జరుగుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గ్రంథాలయాలు అభివృద్ధికి నోచుకోలేదని రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఎంతో పురోభివృద్ధి సాధించామన్నారు. జిల్లాలోని యువతకు గ్రంథాలయాల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

ప్రమాదమనికి నియాలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు

- మృత్యువాత పడుతున్న మూగ జీవాలు



నవతెలంగాణ-భీమారం

ప్రమాదమని తెలిసినా పట్టింపు కరువై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రమాదాలకు నియాలు మారాయి. మూగజీవాల పాలిట మృత్యూ షాపంగా మారింది. మండల పరిధిలోని పోలంపల్లి గ్రామానికి వెళ్ళే ప్రధాన రహదారిలో ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అపాయంగా నిలిచింది. గ్రామ శివారులోని వ్యవసాయ బోరు బావి మోటర్లకు విద్యుత్ అందించేందుకు రోడ్డు పక్కనే ఏర్పాటు చేశారు. ఐతే తరచూ రాకపోకలు సాగించే రహదారి పక్కనే కేవలం రెండు అడుగుల ఎత్తులో ఏర్పాటు చేశారు. దీంతో ట్రాన్‌పార్మర్ తీగలు కిందకి ఉండటంతో ఇక్కడ తరచూ మూగజీవాలు మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. గత ఏడాది భీమారం గ్రామానికి చెందిన దారవేణి పర్వతాలుకు చెందిన మేక పోతు విధుత్తానికి భలైది. అదేవిధంగా పోలంపల్లి గ్రామానికి చెందిన బొల్ల సురేష్‌కు చెందిన మేకలు మృత్యూ వాత పడిన ఘటనలు ఉన్నాయి. అంతే కాకుండా స్థానికంగా అనాథ పిల్లల ఆశ్రమ పాఠశాల కూడా ఉండటంతో భయానక పరిస్థితిలో ఈ ట్రాన్స్‌పార్మర్ దర్శనమిస్తోంది. వెంటనే ట్రాన్స్‌కో అధికారులు స్పందించి, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రమాదాలకు నెలవుగా మారిన ఈ ట్రాన్‌సఫార్మర్‌కు ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని స్థానికలు కోరుతున్నారు



అక్రమ కలప పట్టివేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అక్రమంగా తరలిస్తున్న కలపను సోమవారం రాత్రి పట్టుకున్నట్టు ఆసిఫాబాద్ రేంజి అధికారి అప్పలకొండ తెలిపారు. (ఏపీ01ఆర్ 4251) నెంబర్ కారులో అక్రమంగా కలప తరలిస్తున్నారని ముందస్తు సమాచారం మేరకు అటవీ అధికారులు డోర్లి గనుల ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహించారు. అటువైపుగా కలపతో వస్తున్న కారు డ్రైవర్, దానితో పాటు వస్తున్న బైక్‌పై ఉన్న వ్యక్తులు అధికారులను గమనించి వాహనాలను వదిలి పారిపోయారు. వాహనం వద్దకు వెళ్లి అక్రమ కలప ఉండడంతో అధికారులు వాహనాలను స్వాధీనం చేసుకుని దుంగలు, వాహనాలు రేంజ్ కార్యాలయానికి తరలించారు. వాహనంలో 14 దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు, ఈ దుంగలు 0.394 సెంటి మీటర్లు ఉండి, రూ.27904 విలువ ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్ కుమార్, తిర్యానీ రేంజ్ సెక్షన్ అధికారులు విజయ్ కుమార్, బీట్ అధికారులు స్వప్న ప్రకాశ్ పాల్గొన్నారు.

వసతీగృహంలో ప్రవేశాలకు ధరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తపాల్‌పూర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖా ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో మూడవ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు నూతన ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు హెచ్‌డబ్ల్యూఓ గోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు ఆధారకార్డ్ జిరాక్స్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, బోనాఫైడ్ జిరాక్స్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు జతపర్చాలని సూచించారు.

బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో చోరీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని ఈద్గా కాలనీలో నివాసముండే రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి ఇంట్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ గ్రామీణ బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగి దుర్గం ఆనంద్‌రావు స్థానిక ఈద్గా కాలనీలో నివాసముంటున్నాడు. సోమవారం సాయంత్రం ఆనంద్‌రావు కుటుంబసభ్యులతో కలిసి బెల్లంపల్లికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చేసరికి తలుపుల తాళాలు పగులకొట్టి ఉండడంతో చోరీ విషయం తెలిసింది. ఇంటి ముందు గేటుకు వేసి ఉన్న తాళం యదావిధిగానే ఉండగా లోపల ప్రధాన ద్వారానికి ఉన్న తాళం పగులకొట్టి దొంగలు లోనికి ప్రవేశించారు. లోపల ఆల్మారా తాళాన్ని ఆక్సా బ్లేడ్‌తో కోసి లోపల ఉన్న ఐదున్నర తులాల బంగారం చోరీ చేశారు. ఈ మేరకు బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు టౌన్ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

లైంగికదాడి కేసులో కొనసాగుతున్న విచారణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలో బాలికపై జరిగిన లైంగిక దాడి కేసులో పోలీసుల విచారణ కొనసాగుతోంది. ఈ దాడికి కారణమైన ఇద్దరు యువకులు అభిలాష్, విజయ్‌లు దాడి జరిగిన సమయం నుండి పరారీలో ఉన్న విషయం తెల్సిందే. కాగా వీరిని సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారి నుండి పూర్తి వివరాలు రాబట్టేందుకు పోలీసులు యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. మంగళవారం పోలీసులు లైంగిక దాడి జరిగిన ప్రాంతానికి వెళ్లి పంచనామా నిర్వహించినట్లు తెలిసింది. ఈ విషయమై టౌన్ సీఐ బుద్దె స్వామిని వివరణ కోరగా బుధవారం నిందితుల వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.

పర్యావరణ పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-నస్పూర్

ఉద్యోగులు పనిచేస్తున్న పని స్థలాలల్లో, నివాస గృహాల సముదాయాల్లో పర్యావరణ పరిరక్షణ పాటించాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఆర్కే-8 డిస్పెన్సరీలో స్వచ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు విభాగాలల్లో స్వచ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే పర్యావరణ దినోత్సవం సందర్భంగా డిస్పెన్సరీలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన ఉద్యోగిని, ఉద్యోగులకు జనరల్ మేనేజర్ బహుమతులను అందజేసారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి ఎస్ఓ టు జీఎం గోపాల్ సింగ్, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ పి.రమేష్‌బాబు, క్వాలిటీ మేనేజర్ కె.వెంకటేశ్వర్‌రెడ్డి, డాక్టర్ మురళీధర్, డాక్టర్ వేదవ్యాసు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లోకనాథ్‌రెడ్డి, డివై పీఎం రాజేశ్వరరావు, ఐఈడీ ఎస్ఈ కిరణ్ కుమార్, సీనియర్ పీఓ పి.కాంతారావు, డాక్టర్ స్వప్న, ఆర్కే-8 డిస్పెన్సరీ ఫిట్ కార్యదర్శి ఎం.రమేష్ పాల్గొన్నారు.

త్వరలో బీఎస్ఎన్ఎల్ 5జీ సేవలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



బీఎస్ఎన్ఎల్ 5జీ సేవలు త్వరలో కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రజలకు అందుబాటులోకి రానున్నట్లు టెలీ కమ్యూనికేషన్ బోర్డు సభ్యులు గోలెం వెంకటేష్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూరు (టి) నియోజకవర్గాలలో ఉన్న 18 మండలాలలోని ప్రజలకు చేరువగా బీఎస్ఎన్ఎల్ సేవలు అందించాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఎంపీ సోయం బాబూరావు కృషితో 95 సెల్ టవర్లను మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని తిర్యాణి, లింగాపూర్, సిర్పూర్(యు), రెబ్బెన జైనూర్, ఆసిఫాబాద్, కెరమెరి, వాంకిడి, కాగజ్‌నగర్, దహెగాం, పెంచికల్‌పేట్, బెజ్జూర్, చింతలమానెపల్లి, కౌటాల, సిర్పూర్(టి) మండలాలలో 5జీ సెల్, వైఫై సెల్ సిగ్నల్‌తో సెల్ టవర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు మాచర్ల శ్రీనివాస్, అమిత్ విశ్వాస్, ఈశ్వర్‌దాసు, మాటూరి జయరాజ్ పాల్గొన్నారు.